



రాముడి పెళ్లికి..
రత్నగిరి ముస్తాబు
శ్రీరామగిరిలో
సర్వం సిద్ధం
ఇందుపల్లిలో
బొందరాములోరు 6

అందరి బంధువయా.. భద్రాచల రామయ్యా!

నేడు రాములోరి కల్యాణం

గొల్లలమామిడాడ ముస్తాబు

అందరి బంధువయా.. భద్రాచల రామయ్య.. ఆదుకునే ప్రభువయ్యా..మా అయోధ్య రామయ్య.. రాములోరంటే గ్రామాల్లో ఒక సెంటిమెంట్.. నిత్యం ఆయన సేవలోనే తరిస్తారు.. కొలుస్తారు.. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.. సీతారాముల కల్యాణం చూతము రారండి.. అంటూ భక్తులందరికీ ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లలమామిడాడలో దశాబ్దాల తరబడి సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. మన రాష్ట్రంలోనే ఒంటిమిట్ట తర్వాత అంతటి ప్రాచుర్యం పొందిన అతి పెద్ద రామాలయం ఇదే. ఆంధ్రా భద్రాద్రిగా పేరుగాంచిన ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. తూర్పు, పశ్చిమ దిశల్లో అత్యంత ఎత్తయిన గోపురాలు అందరి దృష్టిని ఆకర్షిస్తాయి. రామాయణ, భాగవతాల్లోని అపురూప ఘట్టాలతో మనోహరంగా తీర్చిదిద్దిన శిల్పాలు అద్భుతంగా కనిపిస్తాయి. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం కోదండరాముడి ఆలయంలో జరిగే కల్యాణోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేశారు. వివాహం కానివారు స్వామి వారి పెళ్లి తలంబ్రాలు శిరస్సుపై ధరిస్తే కల్యాణం జరుగుతుందని..సంతానం లేని దంపతులు తలంబ్రాల బియ్యాన్ని క్షీరాన్నంగా చేసుకుని భుజిస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం.కలెక్టర్,ఎస్పీలు కుటుంబ సమేతంగా విచ్చేసి ముత్యాల తలంబ్రాలు అందించడం ఆనవాయితీ. ఆదివారం కల్యాణం, సోమవారం సుప్రభాత సేవ,నిత్య పూజ, తీర్థగోష్టి, 8వ తేదీన శేషవాహనంపై స్వామి వారి బ్రహ్మోత్సవం,10న స్వామి వారి పుష్కరణి వద్ద వసంతోత్సవం, చక్రస్నానాలు, 11న నిత్యార్చన, ఉయ్యాల సేవ, శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. - కాకినాడ/ఆంధ్రజ్యోతి

గోదారి.. నీరేది!



తూర్పుగోదావరి.. పేరులోనే గోదావరి.. ఎందుకంటే.. జిల్లాకు జీవం గోదావరి.. ఆ గోదారే లేకపోతే ఈ ప్రాంతమంతా ఎడారే.. ఆ నాడు కాటన్ మహాశయుడు గోదావరిపై బ్యారేజీ నిర్మించి గోదావరి జిల్లాల రైతులకెంతో మేలు చేశాడు. అందుకే నేటికీ కాటన్‌ను జిల్లావాసులు దేవుడిగా కొలుస్తారు. గోదావరి ద్వారా ప్రతి ఏటా వేలాది టీఎంసీల నీరు మనకు లభిస్తున్న సంగతి తెలిసిందే.అందులో కొద్దిశాతం కూడా మనం వినియోగించుకోలేకపోతున్నాం. తీవ్ర నీటి ఎద్దడితో కొట్టుమిట్టాడుతున్నాం. నేటికీ ఈ పరిస్థితుల్లో మార్పురాలేదు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా తాగునీటి ఎద్దడి ఉందంటే నిర్లక్ష్యమే కారణం..

కాలువలు కట్టేస్తే.. గొంతు తడిపేది కన్నీళ్లే!

(రాజమహేంద్రవరం/అమలాపురం - ఆంధ్రజ్యోతి)

రానున్న రెండు నెలలు ప్రజలు తాగు, సాగునీటి ఎద్దడిని ఎదుర్కొనాల్సిన పరిస్థితులు ఉత్పన్నం కానున్నాయి. ఉభయగోదావరి జిల్లాల్లో ఇప్పటికే శివారు భూములకు దాళ్వాకు అవసరమైన సాగునీరందని కారణంగా పంటలు ఎండిపోతున్నాయి. నీటి ఎద్దడిని అధిగమించడానికి జలవనరులశాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఆశించిన మేర ప్రయోజనాలు చేకూర్చడంలేదు. డ్రెయిన్లలో క్రాస్‌బండ్లు ఏర్పాటు చేసి శివారు ప్రాంత భూములకు నీరందించాలని కోనసీమ కలెక్టర్ ఇప్పటికే ఇరిగేషన్, డ్రెయిన్ల అధికారులకు ఆదేశాలిచ్చారు.ఆ దిశగా వారు ప్రయత్నాలు చేస్తున్నారు. సాధారణంగా రబీ సీజన్‌తోపాటు మంచి నీటి అవసరాలు, చెరువులకు సుమారు 120 టీఎంసీలు అంచనా వేస్తారు. ఇప్పటివరకూ 103 టీఎంసీల నీటిని వాడారు.11,300 క్యూసెక్కుల నీటిని ఒక టీఎంసీగా పరిగణిస్తారు. మరో పది రోజుల పాటు కాల్వలకు నీరిస్తారు. ఈలోపు పంట అవసరాలు, మంచినీటి అవసరాలు, చేపల చెరువులకు అవసరమైన నీటిని నిల్వ చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులు ఆదేశాలు జారీచేశారు. అయితే నీరు కాల్వలకు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో మంచినీటి ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో నీరు నింపే పరిస్థితి లేదనేది ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజల ఆవేదన. కోనసీమ

16 నుంచి నీరు బంద్

ధవళేశ్వరం కాటన్ బ్యారేజి నుంచి వివిధ ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లే డెల్టా కాలువలను ఈనెల 16న మూసివేయనున్నారు. ప్రతి ఏటా రబీ సీజన్ ముగిసిన తర్వాత మంచినీటి అవసరాలకు నీటిని ఇచ్చి కాలువలకు నీటి విడుదల నిలుపుదల చేస్తారు. అనంతరం కాలువల ఆధునీకరణ పనులు చేస్తారు. జూన్ 1వ తేదీన కాలువలు తెరిచే అవకాశం ఉంది.

- మరో పది రోజుల్లో నీరు బంద్
- కాలువలు కట్టేస్తున్నట్టు ప్రకటన
- నేటికీ నిండని చెరువులు
- కళతప్పిన జలాశయాలు
- శివారుకు అందని సాగునీరు
- ప్రస్తుత నీటిమట్టం 9.5 అడుగులు
- గతేడాది ఇదే రోజు 6.5 అడుగులు
- 239 టీఎంసీలు వినియోగం
- సముద్రంలోకి 4114 టీఎంసీలు

సముద్రంలోకి వేలాది టీఎంసీలు

గతేడాది జూన్ నుంచి ఇప్పటి వరకూ ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 4114 టీఎంసీల గోదావరి నీరు సముద్రంలోకి వదిలేయాల్సి వచ్చింది. కేవలం 239 టీఎంసీల నీరు మాత్రమే వినియోగించాం. ఒక టీఎంసీ అంటే 11,300 క్యూసెక్కులు నీరు.ఒక టీఎంసీ నీటిని వదిలితేనే మన డెల్టా కాలువలు కళకళలాడిపోతాయి. అలాంటిది వేల టీఎంసీల నీటిని వినియోగించుకుంటే గోదావరి జిల్లాలతో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. అందుకే పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. గత వైసీపీ నిర్లక్ష్యం చేసినా.. ప్రస్తుత సీఎం నారా చంద్రబాబునాయుడు పోలవరం పనులు వేగవంతం చేశారు.


జిల్లా పరిధిలోని నాలుగు మునిసిపాలిటీలు, 22 మండలాల పరిధిలో 220కు పైగా గ్రామాలు ఉండగా వాటిలో సముద్రతీర ప్రాంతాల ప్రజలకు తాగునీరందని పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం ఏప్రిల్, మే, జూన్ 15 వరకు ట్యాంకర్ల ద్వారా శివారు ప్రాంతాలకు మంచినీటిని సరఫరా చేయడానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.కలెక్టర్ ఆమోదం తరువాత వీటికి నీటిని సరఫరా చేయనున్నారు.

బ్యారేజీ వద్ద నీటిమట్టం ఇలా

ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో తూర్పు డెల్టాలో 2,64,533 ఎకరాలు, కోనసీమ (సెంట్రల్ డెల్టా)లో 1లక్షా 72వేల ఎకరాలు, పశ్చిమ డెల్టాలో 4 లక్షల 60వేల ఎక రాలు ఆయ కట్టు ఉంది.రబీ సీజన్ డిసెంబర్‌లో మొదలైంది. పూర్తిగా నాట్లు పడేసరికి జనవరి దాటేసింది. ఈ నేపథ్యంలో కొంతనీటి సమస్య ఉంది. వాస్తవానికి నవంబర్ 1న రబీ సీజన్ మొదలయ్యేటట్టు ప్లానింగ్ ఉంటే రబీకి నీటి సమస్య ఉండదు. ప్రస్తుతం సీలేరు నుంచి 8 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. తూర్పు డెల్టాకు 3 వేల క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 2 వేల క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5,300 క్యూసె క్కులు విడుదల చేస్తున్నారు. పోలవరం స్పిల్‌వే వద్ద సుమారు 20 టీఎంసీల వరకూ నీరు ఉన్నట్టు చెబుతున్నారు. దీంతో ఈ సీజన్‌కు పెద్దగా నీటి సమస్య ఉండదని ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్ తెలిపారు. ఇదిలా ఉండగా ధవళేశ్వరం బ్యారేజీ నీటిమట్టం ప్రస్తుతం 9.5 అడుగులు ఉంది. గతేడాది ఇదే సమయానికి కేవలం 6.05 అడుగులు మాత్రమే ఉంది. గతేడాది కంటే ఈసారి బాగుందని లెక్కలు చెబుతున్నాయి.

ఆ మూడింటికి నీటి ఎద్దడి తప్పదా!

సామర్లకోట : సామర్లకోట గోదావరి కాలువకు గత రెండు రోజులుగా నీటి విడుదల తగ్గింది. దీంతో సాగు, తాగునీటికి ఆందోళన చెందుతున్నారు. సామర్లకోట,పెద్దాపురం మునిసిపాలిటీల ప్రజలకు తాగునీటి సరఫరాకు సామర్లకోటలో వేసవి జలాశయం, మహర్షి సాంబ మూర్తి రిజర్వాయర్లు ఉన్నాయి. మహర్షి సాంబమూర్తి రిజర్వాయర్ నుంచే కాకినాడ కార్పొరేషన్ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తారు.అయితే ఈ జలాశయాల్లో నీటి నిల్వలు అడు గంటితే గోదావరి కాలువ నుంచి జలాలను మళ్లించి నిల్వలు పెంచుతారు. సామర్లకోట గోదావరి కాలువకు రెండు రోజులుగా నీటి నిల్వలు తగ్గిపోవడంతో సామర్లకోటలో ఉన్న రెండు జలాశయాలకు నీటిని మళ్లించలేకపో తున్నారు. ప్రస్తుతం గోదావరి కాలువ నుంచి నీటిని మళ్లించకపోతే రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఈ ఏడాది జలాశయంలో పూడిక తొలగింపు పనులు చేపడతామని గోదావరి జలాలను జలాశయంలోకి మళ్లించే ప్రక్రియ గత నెల రోజుల పైబడి నిలిపివేశారు. దీంతో గోదావరి కాలువ నుంచి వస్తున్న కొద్దిపాటి జలాలనే నేరుగా ఫిల్టర్‌వాటర్ స్కీమ్‌కు పంపింగ్ చేసి అరకొరగా ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు.నీటి అక్రమ వినియోగం నియంత్రించలేకపోవడం వల్ల సామర్లకోట, ఉండూరు, వీకె.రాయపురం, మాధవపట్నం, బోయినపూడి, పిఠాపురం బ్రాంచి కాలువలకు చెందిన ఆయకట్టు పొలాలకు నీటి ఎద్దడి నెలకొంది.తాగునీటి జలాశయాలకు నీటి మళ్లింపు పూర్తిగా నిలిచిపోవడంతో మరో వారం రోజుల్లో సామర్లకోట, పెద్దాపురం మునిసిపాలిటీలు, కాకినాడ నగరపాలక సంస్థల ప్రజలు తాగునీటికి అవస్థలు పడక తప్పదని ఆందోళన చెందుతున్నారు. సామర్లకోట గోదావరి కాలువకు ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఉన్నతాధికారులు 3,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ 60 కిలోమీటర్ల శివారున ఉన్న సామర్లకోటకు చేరేసరికి కేవలం 300 క్యూసెక్కుల నీరు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సాగునీటి అవసరాలే అంతంత మాత్రంగా ఉన్న సమయంలో ఇక తాగునీరు మళ్లింపు మరింత కష్టంగా మారనున్నాయి.



ఈ సారి ప్రాజెక్టులకు నీటి సమస్య లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



గొల్లప్రోలు పట్టణ శివారులో వర్షానికి తడిచిన వరి పనలు చూపుతున్న రైతు నడిగట్ల అన్నవరం.. తడిచిన బస్తాలు

నిండా ముంచిన అకాల వర్షం

- తడిచిన ధాన్యం రాశులు
- బస్తాలు తడిచిపోయాయి
- పొలాల్లోనే వరి పనలు
- టార్పాలిన్లు కప్పినా ఫలితం నిల్

పిఠాపురం/గొల్లప్రోలు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అకాలవర్షం నిండా ముంచింది. ధాన్యం రాశులు తడిచి ముద్దయ్యాయి. వరి పనలు నీటి తడిచాయి. ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలో సుమారు లక్ష ఎకరాల్లో దాళ్వా వరిసాగువుతోంది. ప్రస్తుతం వరి కోతలు, మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పలుచోట్ల వరి కోత యంత్రాల ద్వారా కోతలు నిర్వహిస్తుండడంతో తేమశాతం తగ్గేందుకు ధాన్యాన్ని ఎక్కడికక్కడ ఆరబెడుతున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో ఖాళీ స్థలాలు, తిమ్మాపురం నుంచి కత్తిపూడి మధ్య గల 216వ జాతీయరహదారి, పిఠాపురం-సామర్లకోట, ఉప్పాడ-పిఠాపురం సహా గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల వెంబడి ధాన్యాన్ని ఆరబెట్టారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లోని లేఅవుట్ స్థలాలను ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు వినియోగిస్తున్నారు. సుమారు 3,500 ఎకరాల్లో మాసూళ్లు పూర్తికావడంతో ఈ ధాన్యం రాశులన్నీ రహదారులు, కళ్లాల్లోనే ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఆకస్మికంగా వాతావరణం మారి భారీవర్షం కురిసింది. మేఘాలు అలముకోగానే రైతులు టార్పాలిన్లు, ఇతర కవర్లు వేసి వర్షానికి తడవకుండా రక్షణ చర్యలు చేపట్టారు. అయినా వర్షపునీరు ధాన్యం రాశుల్లోకి చేరింది. దీంతో ధాన్యం రాశులు తడిచిపోయాయి. ధాన్యం బస్తాలు సైతం పలుచోట్ల తడిచాయి. వీటిని మరో రెండు మూడు రోజులు ఆరబెట్టాల్సి ఉంటుందని వారు తెలిపారు. మరోవైపు సాధారణ పద్ధతుల్లో వరికోతలు పూర్తయిన పొలాల్లో వరి పనలు పంటపొలాల్లోనే ఉండిపోయి వర్షానికి తడిచాయి. ఈ మండలాల్లో 200 ఎకరాల్లో వరి పనలు నీట తడిచినట్టు చెబుతున్నారు.

జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి

జిల్లాలో పలుచోట్ల సాయంత్రం నాలుగు గంటల నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట, సామర్లకోట, ఉప్పాడ, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో భారీగా వర్షం పడింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చాలాచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



కాకినాడ నగరంలో నీట మునిగిన రోడ్డు

'వానా'వరణం..
కాకినాడ జిల్లాలో భారీ వర్షం..
అత్యధికం కిర్లంపూడిలో 7



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఇర్రిపాకలో పల్లె పండుగ

పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే జ్యోతుల

జగ్గంపేట రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా కలెక్టర్ షాన్ మోహన్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి కలెక్టర్ ఎస్సీ కాలనీ నుంచి శివాలయం వరకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించారు. అనంతరం ఇర్రిపాకలో ఉపాధి హామీ పథకం నిధులతో రైతు కంబాల సూర్యనారాయణ నిర్మించుకున్న మినీ గోకులం షెడ్డును కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ నిధులతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న శివ కేశవుల దేవాలయాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే నెహ్రూ దేవాలయ విశిష్టతను కలెక్టర్‌కు వివరించారు. శివ కేశవుల చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలు అందించారు. జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారానే రాష్ట్ర అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. చంద్రబాబు ముందుచూపుతోనే అన్ని రంగాలు రాణిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, ఎస్వీఎస్ అప్పల రాజు, మారిశెట్టి భద్రం తదితర్లు పాల్గొన్నారు.

గ్రామాలకు సీసీ రోడ్ల పండుగ

ఎమ్మెల్సీ నాగబాబు సుడిగాలి పర్యటన

21 రహదారులకు ప్రారంభోత్సవాలు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్/పిఠాపురం రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు సీసీ రోడ్ల పండుగ వచ్చింది. గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్సీ నాగబాబు ప్రారంభించారు. అక్కడ ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అన్ని రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ ప్రదాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు రెండవ రోజు పిఠాపురం నియోజకవర్గంలోని ఎనిమిది గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పల్లెపండుగలో భాగంగా రూ.3.70కోట్లుతో నిర్మించిన 21రోడ్లను ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. పిఠాపురం మండలం కుమారపురం హౌసింగ్ లేఅవుట్-1లో రూ.15.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, విరవ నుంచి గోకివాడ బ్రిడ్జి వరకూ రూ.75 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు, గోకివాడలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటలో రూ.28.95 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, వన్నెపూడిలో రూ.29.65లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో నాగబాబుకు ఘనస్వాగతం లభించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రహదారులను నూరుశాతం సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌడా చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా పిఠాపురం నియోజకవర్గాన్ని నిలిపేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృతనిశ్చయంతో ఉన్నారని ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు తెలిపారు. చేబ్రోలులోని పవన్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు.



పిఠాపురం మండలం గోకివాడలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివి

- కలెక్టర్ షాన్‌మోహన్
- డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

కాకినాడ రూరల్/ కాకినాడ క్రైం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ఉన్నతికి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చేసిన సేవలు ఎనలేనివని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా ఇంద్రపాలెం వంతెన సమీపంలోని లేడీస్ లయన్స్ క్లబ్ వద్ద జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, జేసీ రాహుల్‌మీనా, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొని జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి శనివారం పూలమాలలువేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ దేశానికి ఎన్నో రకాలుగా సేవలు అందించారన్నారు. ఎమ్మెల్సీ రాజశేఖర్ మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ వ్యక్తి బాబు జగ్జీవన్‌రామ్ అన్నారు. ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ 45 ఏళ్ల ఎంపీగా ఉండి 30ఏళ్లపాటు రాజకీయంగా వివిధ హోదాల్లో జగ్జీవన్‌రామ్ పనిచేశారన్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు హౌసింగ్, డీఆర్డీఏ పీడీలు సత్యనారాయణ, జి.శ్రీనివాసరావు, సంక్షేమశాఖ ఇన్‌చార్జి జేడీ ఎస్.శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి, బీసీ సంక్షేమ అధికారి లల్లీ, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ డీడీ డి.నాగార్జున పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్పీ జి.బిందు మాధవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డాక్టర్ జగజ్జీవన్‌రామ్ ఆదర్శ ప్రాయుడని, దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం మరువ లేనిదన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్‌డీఎస్పీ శ్రీహరిరావు పాల్గొన్నారు.



జగ్జీవన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జిల్లా కలెక్టర్



ఇంద్రపాలెం వంతెన సమీపంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కొండబాబు, చినరాజప్ప, ఎమ్మెల్సీ రాజశేఖర్



నివాళులర్పిస్తున్న ఎస్పీ బిందుమాధవ్



ఉప్పాడ శివారు కొత్తమాయాపట్నంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఫ్లెక్సీలో సీఎం ఫొటో లేకపోవడంతో ఆందోళన చేపట్టిన టీడీపీ కార్యకర్తలు

ఉప్పాడలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో సీఎం ఫొటో లేదని టీడీపీ ఆందోళన

కొత్తపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల్లో ముఖ్యమంత్రి ఫొటో లేకపోవడంతో టీడీపీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. పల్లె పండుగలో భాగంగా కొత్తపల్లి మండలం ఉప్పాడ శివారు న్యూ నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ కె.నాగేంద్రబాబు శనివారం విచ్చేశారు. ఈ కార్యక్రమానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో సీఎం చంద్రబాబు ఫొటో లేకపోవడంతో టీడీపీ కొత్తపల్లి మండల పార్టీ అధ్యక్షులు అనిశెట్టి సత్యానందరెడ్డి నాయకత్వంలో కార్యకర్తలు ఆందోళన చేపటారు. వీరిని పోలీసులు అడ్డుకోవడంతో ఆందోళన మరింత ఉధృతం చేశారు. జైతెలుగుదేశం, జైచంద్రబాబు, వర్మ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేస్తూ ఆ ప్రాంతం నుంచి వెళ్ళిపోయారు.

రాములోరి కల్యాణం

● నేడు శ్రీరామనవమి వేడుకలు ● ముస్తాబైన రామాలయాలు ●చలువ పందిళ్లు ఏర్పాటు చేసిన ఆలయ కమిటీలు

చూతము రారండి



పెన్సిల్‌పై సీతారామచంద్రుల ఛాయాచిత్రం



ఆత్రేయపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెర్లపాలానికి చెందిన 10వ తరగతి విద్యార్థి మెర్ల సత్య సాయి రమ పెన్సిల్‌పై సీతారామ చంద్రుల ఛాయాచిత్రాన్ని గీసి తన భక్తిభావాన్ని చాటుకున్నాడు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా వేసిన ఈ చిత్రం పలువుర్ని విశేషంగా ఆకట్టుకుంది.

చారిత్రక పురుషుడు శ్రీరాముడు

● ప్రాచీన కాలం నుంచి నాణేల ముద్రణ



సీతారామ లక్ష్మణుల చిత్రాలు ముద్రించిన విజయనగర సామ్రాజ్య నాణేలు





కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రామాయణం ప్రతి మనిషికి నిత్య పారాయణం... అని వాల్మీకి మహర్షి చెప్పారు. రాముడు ధర్మానికి నిలువెత్తు రూపం. ఒక పరిపూర్ణ మానవుడికి ఉండాల్సిన లక్షణాలు కలిగి మనిషి ఎలా జీవించాలో, ఇతరుల పట్ల ఎలా ప్రవర్తించాలో స్వయంగా ఆచరించి చూపిన చారిత్రక పురుషుడు శ్రీరాముడు. ఆయన జీవితం మానవాళికి ఆదర్శప్రాయం. అటువంటి సీతారాములపై ప్రాచీన కాలం నుంచి రాజులు, సంస్థానాధీశులు నాణేలు ముద్రిస్తున్నారు. మన చరిత్ర, సంస్కృతిని ప్రతిబింబించే ఈ నాణేలను కాకినాడకు చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త మార్ని జానకీరామ చౌదరి సేకరించి భద్రపరిచారు. క్రీ.శ. 15వ శతాబ్దంలో విజయనగర పాలకులు సీతారామ లక్ష్మణులతో పాటు ఇతర దేవలను కూడా నాణేలపై ముద్రించేవారు. దక్షిణ భారతదేశాన్ని పాలించిన మధురై నాయక రాజులు కూడా శ్రీరామ, హనుమ, గణేశ వంటి చిత్రాలను కూడా ముద్రించి చలామణీ చేసేవారు. గత శతాబ్దాల్లో లభ్యమైన రామటంకాలు, రామమాడలు అని పిలిచే నాణేలను చారిత్రక పరిశోధకుల కథనాల ప్రకారం మొఘల్ పాదుషా అక్బర్, విజయనగర చక్రవర్తులు, కళింగ రాజులు ముద్రించినట్టు చెప్పారు. జె.గిబ్స్ అనే పరిశోధకుడి సమాచారం మేరకు దక్షిణ భారతదేశంలోని కొంతమంది హైందవ పూజారులు ముద్రించి, టోకెన్లుగా అమ్మడం జరిగింది.



మార్ని జానకిరామచౌదరి, నాణేల సేకరణకర్త, కాకినాడ

- ఆంధ్రజ్యోతి/కాకినాడ కార్పొరేషన్

శ్రీరామగిరిలో సర్వంసిద్ధం



వీఆర్‌పురం : ముస్తాబైన శ్రీరామగిరి దేవాలయం

వీఆర్‌పురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామగిరిలో జరగబోయే రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ పెండుర్తి సుదర్శన్, ఈవో తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి రెండో భద్రాద్రిగా పిలవబడే శ్రీరామగిరి కొండపై దక్షిణ ముఖంగా కొలువైవున్న సుందర సీతారామ చంద్రస్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం కోసం ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భద్రాద్రి బోట్ యూనియన్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు, కుకునూరు, వేలేరుపాడు మండలాల నుంచి కల్యాణానికి వచ్చే భక్తుల కోసం గోదావరి నదిపై మూడు బోట్లు ఏర్పాటు చేశామని బోట్ నిర్వాహకుడు మాదిరెడ్డి సత్యనారాయణ తెలిపారు.

రత్నగిరి రామయ్య పెళ్లి కొడుకాయనే..

అన్నవరం, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): అన్నవరం ఆలయ క్షేత్రపాలకుడిగా పూజలందుకుంటున్న సీతారాముల ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం నాలుగు గంటలకు రామాలయంలో ప్రత్యేక వేదికపై నవదంపతులు కానున్న సీతారాములు, మరో వేదికపై పెండ్లి పెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను ఆశీనులు గావించి పండితులు గణపతిపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుణ్యాహవచనం అనంతరం ఉల్లూకుల గౌరీపూజ నిర్వహించగా, ముత్తైదువులు పసుపు దంచారు. చివరగా చతుర్వేద పండితులు వేద స్వస్తి గావించారు. ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, చైర్మన్ రోహిత్, తదితరులు పాల్గొన్నారు.



అన్నవరంలో ప్రత్యేక పూజలు...

170 ఏళ్ల నాటి రామాలయం



పురాతన సీతంపేట రామాలయం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా రాజమహేంద్రవరంలోని సీతంపేటలో 170 సంవత్సరాల చరిత్ర కలిగిన రామమందిరంలో ఆదివారం ఉదయం శాంతి కల్యాణం, తదుపరి సీతారామ కల్యాణం వైఖానస ఆగమ పద్ధతిలో జరుగుతుందని ఆలయ అర్చకుడు వై.శ్రీనివాసాచార్యులు తెలిపారు. నవమి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదిరోజుల పాటు ప్రతిరోజూ ఉదయం స్వామివారి శాంతికల్యాణం, సాయంత్రం సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. సీతారామాలయం.. జాంపేట పోలీస్ క్వార్టర్స్‌లో ఈ ఆలయం వెలసి సుమారు 72 సంవత్సరాలైందని, దీన్ని దర్శించిన భక్తులు కోరిన కోర్కెలు సీతారాములు తీరుస్తారని నమ్మకం. అందువల్ల అనేక మంది భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని వచ్చి దర్శించుకుంటారని, ఈసారి సీతారామ కల్యాణానికి, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ దంపతులు వచ్చి పీటల మీద కూర్చుంటారని ఆలయ అధ్యక్షుడు ఏవీ రమణారెడ్డి తెలిపారు. ఈ నెల 17న ఆలయం వద్ద జరిగే మహాన్నదానానికి దాత ఎంవీ కృష్ణారెడ్డి రూ. రెండు లక్షల విరాళంగా ఇచ్చారని పేర్కొన్నారు.

రాములోరి కల్యాణంలో వింతలెన్నో..

ఒక్కో గ్రామంలో ఒక్కో ఆచారం

శ్రీరామచంద్రుడు మానవునిగా జన్మించినరోజు శ్రీరామనవమి. కానీ ఆయన పుట్టినరోజు నాడే జగత్ కల్యాణ కారుకులుగా సీతారాముల కల్యాణం జరపడం అనాదిగా వస్తున్న ఆచారం. నేటి ఆధునిక సమాజంలో అష్టకష్టాలు పడుతున్నామని వాపోయేవారు ఎందరో. కానీ శ్రీరామచంద్రుడు పడినన్ని కష్టాలు ఇంతవరకు మరెవ్వరూ పడలేదంటే ఎంతమాత్రం అతిశయోక్తికాదు. ధర్మానికి ప్రతీకలైన ఆదర్శ దంపతులు సీతారాముల కల్యాణం శ్రీరామనవమి రోజున జరగని గ్రామం ఉండదు. రాములోరి కల్యాణం ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా జరగడం విశేషం.



భీమభక్తునిపాలెంలో విజయదశమి రోజునే కల్యాణం..

పేరూరు భీమభక్తునిపాలెంలో ఓ రామాలయం ఉంది. ఈ ఆలయంలో మాత్రం ఏటా విజయదశమి రోజున సీతారాముల కల్యాణం జరపడం ఇక్కడి ఆచారం. శతాబ్దాల కాలం కిందట నిర్మించిన ఆలయంలో తరతరాలుగా ఇదే ఆచారాన్ని గ్రామస్తులు కొనసాగిస్తున్నారు. సీతారాముల కల్యాణాన్ని శ్రీరామనవమి రోజున జరుపకపోవడానికి నాటి తరం వారు వలస కూలీలుగా పనిచేయడమే కారణమట. భీమభక్తునిపాలెం వాసులు పెంకు నేత పనిలో నిష్ణాతులు. శ్రీరామనవమి రోజుల్లో వీరంతా పెంకునేత పనుల్లో బిజీగా ఉండేవారు. నేడు పెంకుతీత పనులు లేకపోయినా అదే ఆచారాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు. అయితే నవమి రోజున రామాలయం వద్ద అందరికీ పానకాలు పంచుతారు.

భట్లపాలెంలో తలంబ్రాల బియ్యంతో వంట..



సీతారాముల కల్యాణ తలంబ్రాల కోసం అందరూ ఎగబడతారు. అయితే ఇందుపల్లి శివారు భట్లపాలెంలోని శ్రీరామాలయం వద్ద మాత్రం తలంబ్రాల బియ్యంతో పిల్లలు పుట్టలేదన్న బెంగను తొలగించుకుంటారు. కల్యాణం అనంతరం సీతారాములపై పోసిన తలంబ్రాల బియ్యాన్ని ఎవరికి అందినంత వారు అందిపుచ్చుకుంటారు. సంతానం లేని దంపతులు, కుటుంబ సమస్యలతో బాధపడేవారు ఆ తలంబ్రాల బియ్యంతోనే రామాలయం వెనుక వంటలు చేసుకుంటారు. సీతారాముల కల్యాణ తంతు పూర్తయ్యేసరికి వంటలు పూర్తి కావడమే కాదు ఆ దంపతులు భోజనాలు పూర్తిచేయాలి. అలా చేసిన వారు త్వరలోనే తల్లిదండ్రులు అవుతారని భక్తుల ప్రగాఢ నమ్మకం. అందుకు ఎన్నో నిదర్శనలు ఉన్నాయంటున్నారు. కల్యాణ తలంబ్రాలతో వంట చేసుకోవడం తరతరాల ఆచారం.





ఇందుపల్లిలో బొందరాములోరు..

తమిళనాడుకు చెందిన ద్రావిడ బ్రాహ్మణులు వలస వచ్చి కోనసీమలోని పలు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అటువంటి ద్రవిడ బ్రాహ్మణులు నివసిస్తున్న ప్రాంతాల్లో సీతారాముల కల్యాణంలో ఎన్నెన్నో వింతలు ఉన్నాయి. ప్రత్యేకంగా ఇందుపల్లిలో కూర అరటిగెల బొంతను శ్రీరామచంద్రునిగా కొలుస్తారు. బొందను తిరగేసి భూమిలో పాతి ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉగాదిరోజున ప్రారంభించి వసంత నవరాత్రులుగా తొమ్మిది రోజుల పాటు నిత్యం పూజలు నిర్వహించడంతోపాటు హాజరైన భక్తులందరికీ పానకాలు అందిస్తారు. శతాబ్దాల కాలం కిందటే పేరి కామయ్య అనే వ్యక్తి బొందరాముని పూజలు ప్రారంభించారని పెద్దలు చెబుతారు. శ్రీరామనవమి రోజున కల్యాణం జరిపించే బొందరాముడిని ప్రత్యేక వాహనంలో ఉంచి నిమజ్జనం చేస్తారు. ఇక ద్రవిడ బ్రాహ్మణులు నివాసముంటున్న బోడసకుర్రు, అమలాపురం దుడ్డువారి అగ్రహారంలలో శ్రీరామచంద్రుడిని డబ్బాల రామునిగా కొలుస్తారు. అదేవిధంగా పేరమ్మ అగ్రహారంలో గోదారి రాముడంటూ కల్యాణం జరిపిస్తారు.

- ఆంధ్రజ్యోతి/అమలాపురం రూరల్

నేడు ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణం

● ఏర్పాట్లు పూర్తి



ర్యాలి జగన్మోహిని కేశవస్వామి, పూజలు చేస్తున్న అర్చకుడు

ఆత్రేయపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి కల్యాణోత్సవాలు నేటి నుంచి 13వ తేదీ వరకూ రంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు పెండ్లి కుమారుడిని చేయడం, గ్రామోత్సవం, అంకుర్పారణ, ధ్వజారోహణం, తదితర కార్యక్రమాలను నిర్వహించి రాత్రి 8.45 నిమిషాలకు వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం శ్రీనివాసుల వెంకటాచార్యులు బ్రహ్మత్వంలో స్వామివారి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించనున్నారు. 7నుంచి 9వ తేదీవరకూ స్వామి వారికి అభిషేకం, తుసిపూజ, నిత్యపాసన తదితర కార్యక్రమాలతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 10న సదస్యం, 11న ప్రత్యేక పూజలు, 12న చక్రస్నానం, 13న శ్రీపుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి. స్వామివారి ఉత్సవాలకు సంబంధించి అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి తెలిపారు.

స్వామివారి చరిత్ర...

స్వయంభూగా వెలిసిన జగన్మోహిని కేశవ స్వామి ముందు పురుష రూపం, వెనుక శ్రీరూపంలో దర్శనమిస్తారు. స్వామివారి పాదాల చెంత నిత్యం గంగ ఉద్భవిస్తుంది. స్వామివారి విగ్రహం ఎంతో కళా నైపుణ్యం సంతరించుకుంది. చూపరులను ఎంతగానో ఆకర్షిస్తుంది. శిల్ప కళానైపుణ్యం ప్రతిబింబిస్తోంది. గర్భాలయ ప్రవేశం కలదు. రావులపాలెం నుంచి 6 కిలో మీటర్ల దూరంలో ర్యాలి గ్రామంలో స్వామి వారి సన్నిధికి చేరుకోవచ్చు.



ఆలయ రాజగోపురం

నిత్యాన్నదానం

దేశంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. భక్తులకు ఉగాది నుంచి నిత్యాన్నదానం ప్రారంభించారు. సుమారుగా నెలకు 50వేల మంది భక్తులు తరలివస్తున్నారు. 20వేల మంది భక్తులు అన్నదానం స్వీకరిస్తారని అంచనా వేస్తున్నారు. వార్షిక ఆదాయం రూ.1.20కోట్లకు చేరుకుంది. అన్నప్రసాద విరాళాలు రూ.1.40కోట్లు సమకూర్చారు. స్వామివారి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సీజేఎఫ్ నిధుల ద్వారా రూ.2కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు రూపొందించారు. గోపాలస్వామివారి రాజగోపుర నిర్మాణం మాసకల్యాణ భవనం వసతిగృహాల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ఖ్యాతిని ఆర్జించడంతో ఐదు బుధవారాలు ఐదు ప్రదక్షణలు స్వామి వారికి భక్తులు నిర్వహించుకుంటున్నారు. ప్రతి నెలా మాసకల్యాణం(రూ.750). సుమారు 300 మంది స్వామి కల్యాణాలు నిర్వహిస్తారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

● వెంకన్న ఆదాయం రూ.50,34,559



ప్రతేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధరకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధసేవల ద్వారా స్వామివారి ఒక్క రోజు ఆదాయం రూ.50,34,559 లభించినట్లు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లిలో పర్యటిస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఆర్డీవో పర్యటన

స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా ఆర్డీవో పి.శ్రీకర్ శనివారం ఆలయంలో పర్యటించారు. డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావుతో కలిసి కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. శనివారం భక్తుల రద్దీ, ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంగళవారం స్వామివారి కల్యాణోత్సవానికి సంబంధించి ఏర్పాట్లపై తగుసూచనలు చేశారు.

కిక్కిరిసిన శృంగార వల్లభస్వామి ఆలయం



భక్తులకు దర్శనమిస్తున్న శృంగార వల్లభస్వామి

పెద్దాపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో తొలి తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత శృంగారవల్లభస్వామివారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చకస్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామివారిని సుమారు పదివేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,18,640, అన్నదాన విరాళాల ద్వారా రూ.76,104, కేశఖండన ద్వారా రూ.6,880, తులాభారం ద్వారా రూ.200, లడ్డూప్రసాదం ద్వారా రూ.24,000, స్వామివారికి కానుకల ద్వారా రూ.110 కలిపి మొత్తం రూ.3,25,934 ఆ దాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వసంత నవరాత్రి పూజలు

సామర్లకోట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వసంత నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారికి, కంచి మహాసంస్థానం ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం చెంతన స్వయంవరపార్వతి అమ్మవారికి ఏడో రోజైన శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న తదితరులచే వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. నూతన పట్టువస్త్రాలతో అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



వసంతనవరాత్రి పూజలలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు, పుష్పార్చనపూజలో స్వయంవరపార్వతి అమ్మవారు

క్రీడాకారులతో దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు

● తూర్పుగోదావరి ఎస్పీ నరసింహ కిశోర్

దివాన్‌చెరువు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకువస్తారని జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఏపీ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు శనివారం దివాన్‌చెరువులోని కళ్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. ఐకాన్స్ చార్టర్ ప్రెసిడెంట్ తీగలరాజా అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన క్రీడాకారిణి కరణం మల్లేశ్వరి వెయిట్‌లిఫ్టింగ్ ద్వారా దేశానికి కీర్తిప్రఖ్యాతులు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకులను ఆయన అభినందించారు. ఐకాన్స్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు ఇమ్మణ్ణి వెంకట్ మాట్లాడుతూ అండర్-15, అండర్-20 బాలుర బాలికల విభాగంలో నిర్వహిస్తున్న ఈ కుస్తీపోటీలకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. రెండు రోజులపాటు జరుగుతాయని చెప్పారు. ఈ పోటీల్లోని విజేతలు ఈనెల 23న రాజస్థాన్‌లోని కోటలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎలీషారావు మాట్లాడుతూ రాజమండ్రిలో ఆనాడు తాలింఖానాలు ఉండేవని ఎందరో క్రీడాకారులు మట్టిలో కుస్తీలు పట్టేవారని, ఇప్పుడు మేట్ మీద రెజ్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ఏపీ అమెచ్యూర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు, కార్యదర్శి వెంకటరమణ, ఐకాన్స్ రాజమహేంద్రవరం ఉపాధ్యక్షుడు వెంకన్నబాబు, కార్యదర్శి సురేష్, ఉదయగిరి, రోటరీ రివర్ సిటీ అధ్యక్షుడు నాళం నరసింహారావు, బూరుగుపల్లి రామారావు, బూరుగుపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్



కుస్తీపోటీలో తలపడుతున్న క్రీడాకారులు

శనేశ్వరాలయంలో భక్తుల రద్దీ

●స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.2.59 లక్షలు

కొత్తపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మందపల్లి శనేశ్వర (మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా రూ.2,59,464 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వినోదం.. ప్రమాదం!

వేసవి రావడంతో రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్‌కి పిల్లలు ఎక్కువగా వెళ్తున్నారు. స్నానాల సమయంలో వినోదం కోసం రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. ప్రమాదమని తెలిసినా లోతుకు వెళ్తున్నారు. పాత రైలు వంతెన స్తంభాలకు వాటర్ మోటార్ల కోసం ఏర్పాటు చేసిన నిచ్చెన వంటి అమరిక ద్వారా ఎక్కి వంతెన పైనుంచి అమాంతం గోదావరిలోకి దూకుతున్నారు. కొందరు 2,3 స్తంభాల (స్పాన్లు) అవతలికి వెళ్లిపోతున్నారు. ఈ రేవులో బాగా లోతు ఉంటుంది. కానీ ఎక్కడా లోతును హెచ్చరించే బోర్డులు కానరావడం లేదు. వేసవి సెలవులు పూర్తిగా ఇస్తే ఈ రేవుకు పిల్లల తాకిడి మరీ ఎక్కువగా ఉంటుంది. గతంలో ఈ రేవులో పిల్లలు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు ఉన్నాయి. జనం భద్రతను గోదావరికి వదిలేయడం సరికాదని పలువురు అంటున్నారు.

- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)



'వానా'వరణం..

- కాకినాడ జిల్లాలో భారీ వర్షం
- ఉదయం హాట్.. హాట్.. సాయంత్రం కూల్ కూల్..
- నేలకొరిగిన చెట్లు, నీట మునిగిన వీధులు
- తడిసి ముద్దయిన ధాన్యపు రాశులు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

పగలంతా ఎండవేడిమితో అల్లాడిన కాకినాడ జిల్లా వాసులు శనివారం సాయంత్రం భారీగా కురిసిన వర్షంతో సేదదీరారు. వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతూ 35 డిగ్రీలకు పైబడి నమోదవుతున్నాయి. ఎండదెబ్బకు జనం బయటకు వచ్చేందుకు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం పదిగంటల్లోపే అన్ని పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఇక ఆఫీసులకు, వివిధ పనుల కోసం బయటకు వెళ్లే వాళ్లు ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉంటే కాకినాడలో శనివారం ఉదయం 36 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జనం ఆపసోపాలు పడ్డా రు. అయితే సాయంత్రం నాలుగు గంటల నుం చి జిల్లా వ్యాప్తంగా వాతావరణం పూర్తిగా మేఘావృతమైంది. భారీ ఈదురుగాలులు, ఉరుము లు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీం తో పలు చోట్ల వృక్షాలు నేలకొరిగాయి. మరోవైపు అకాల వర్షం అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట, పిఠాపురం, గొల్లప్రోలు, ఉప్పాడ, కాకినాడ రూరల్ తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. పిఠాపురంలో వర్షానికి ధాన్యపురాశులు తడిసి ముద్దయ్యాయి. కాకినాడలోని పలు రహదారులు నీటమునిగాయి. పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. కచేరీపేటలో వృక్షం కూలింది. కొత్తపేట మార్కెట్ ఏరియా, సినిమారోడ్డు, రాగంపేట, బ్యాంకు పేట, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు నిలిచింది. ఇదిలా ఉంటే కాకినాడలో సాయంత్రం 5 గంటల నుంచి అంధకారం అలుముకుంది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



కాకినాడలోని ఓ రోడ్డులో నిలిచిపోయిన వర్షం నీరు

పిఠాపురం, గొల్లప్రోలులో భారీ వర్షం

పిఠాపురం/గొల్లప్రోలు, ఏప్రిల్ 5(ఆంధ్ర జ్యోతి): పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వాతావరణం మేఘావృతమై భారీ గాలులతో సుమారు గంట పాటు కురిసిన వర్షంతో 2 పట్టణాల్లో రహదారులు జలమయమయ్యాయి. ఎక్కడిక్కడ డ్రైన్లు పొంగిపొర్లాయి. పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచిపోయింది. చెట్లు కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలుచోట్ల మామిడితోటల్లో మామిడికాయలు రాలిపోయాయి. వాతావరణం చల్లబడటంతో ప్రజలు కాస్తా సేదతీరారు.



పిఠాపురంలో కురుస్తున్న భారీ వర్షం

రాష్ట్రంలోనే అధికశాతం నమోదు

కిర్లంపూడిలో 46.8 మిల్లీమీటర్ల వర్షపాతం

కిర్లంపూడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడిలో శనివారం సాయం త్రం భారీ వర్షం కురిసింది. 46.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోనే అధిక వర్షపాతం కిర్లంపూడిలో నమోదైందన్నారు. గంటపాటు ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయ్యాయి. డ్రైనేజీలన్నీ ఉప్పొంగాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మామిడిరైతులు ఆందోళన చెందుతున్నారు.



కిర్లంపూడిలో నేలకొరిగిన చేలు

ధాన్యం బస్తాలకు 'షెల్టర్'



ధాన్యం బస్తాలకు బస్‌షెల్టర్‌కు అక్కరకు వచ్చింది. 216వ జాతీయ రహదారిపై తాటిపర్తి జంక్షన్‌కు దూరంగానేషనల్ హైవేస్ అథారటీ నిర్మించిన బస్‌షెల్టర్ కొంతకాలంగా నిరుపయోగంగా ఉంది. శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో ధాన్యం బస్తాలు తడవకుండా రైతులు ఈ బస్‌షెల్టర్‌లోకి చేర్చారు. వర్షానికి బయటభాగం కొంత తడిచినా కాపాడుకోగలిగామని, ఈ బస్‌షెల్టర్ ఈ విధంగా పనికొచ్చిందని రైతులు తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-గొల్లప్రోలు రూరల్)

నేలకొరిగిన భారీ వృక్షాలు

మారేడుమిల్లి/కరప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శనివారం ఈదురుగాలులకు మారేడుమిల్లి-భద్రాచలం ప్రధాన రహదారిపై భారీవృక్షం నేలకొరిగింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దేవరపల్లి సమీపంలో రహదారికి అడ్డంగా నేలకొరగడంతో శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం వైపు వెళ్తున్న వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 108 వాహనం సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో కొద్దిసేపు ఆం దోళన చెందారు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమీపంలోని దేవరపల్లి గ్రామ యువత స్వం దించి భారీ వృక్షాన్ని నరికి తొలగించారు. అలాగే ఈదురుగాలులకు కాకినాడ జిల్లా కరప మండలం సిరిపురం-జి.బావారం రోడ్డులో భారీవృక్షం నేలకొరిగింది. దీంతో ఆ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి.



దేవరపల్లి సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం



సిరిపురం-జి.బావారం రోడ్డులో నేలకొరిగిన భారీ వృక్షం

కాకినాడ జీజీహెచ్‌లో ఇంటిగ్రేటెడ్ సెంటర్ ప్రారంభం

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సికిల్‌సెల్, రక్తహీనత, తలసేమియా తదితర ప్రాణాంతక వ్యాధులను నిర్ధారించేందుకు దోహదపడే ఏకీకృత కేంద్రాన్ని (ఇంటిగ్రేటెడ్ సెంటర్)ను డీఎంఈ, డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వీసీ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం శనివారం కాకినాడ జీజీహెచ్‌లో ప్రారంభించారు. ఐసీహెచ్‌హెచ్ సెంటర్‌కు జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఏపీ బ్లడ్‌సెల్ సంస్థ రూ.24 లక్షల నిధులతో ఖరీదైన పరికరాలను అందజేసింది. ఈ ఐసీహెచ్‌హెచ్ సెంటర్‌ను డాక్టర్ నరసింహం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరికరాల ద్వారా జన్యుపరమైన ఎరుపు రక్త కణాలకు వచ్చే వ్యాధులు అనగా సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియా, హిమోగ్లోబినో ప్యాథీస్, హిమోఫీలియా వ్యాధులను నిర్ధారించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి 24 గంటల ల్యాబ్‌లో హెమటాలజీ అనలైజర్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ పరికరం ద్వారా త్వరితగతిన సిబిసి పరీక్షల నివేదికలను రోగులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని వల్ల ఓపీ పేషెంట్లకు ఏ రోజుకారోజు రిపోర్టులు ఇవ్వడం ద్వారా అదే రోజున వ్యాధి నిర్ధారణ పూర్తి చేసి అదేరోజు ఉచితంగా ఔషదాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజ్యలక్ష్మి, పలువురు ఫ్యాకల్టీలు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.



ఇంటిగ్రేటెడ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీఎంఈ డాక్టర్ నరసింహం

పల్లంలో హెపటైటిస్ కలకలం

రక్త నమూనాలు సేకరించిన వైద్యులు, 200మందికి రాపిడ్ టెస్ట్‌ల్లో పాజిటివ్



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కాట్రేనికోన, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం గ్రామంలో కాలేయ వ్యాధులు ప్రబలుతున్నాయన్న సమాచారంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరు వైద్య బృందాలు శనివారం గ్రామంలో హెపటైటిస్ బీసీ పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి 15 ఏళ్ల దాటిన వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరు వేల మందికి పరీక్షలు నిర్వహించవలసి ఉండగా శనివారం 2వేల మందిని పరీక్షించినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. వారిలో 200మందికి రాపిడ్ టెస్ట్‌ల్లో పాజిటివ్ వచ్చిందన్నారు. వారి రక్త నమూనాలను అమలాపురం ప్రభుత్వాసుపత్రిలో పరీక్షించి రోగ నిర్ధారణ చేస్తామన్నారు. అవసరమైన వారికి వైద్యం చేస్తామన్నారు. రూ.6వేలు ఖర్చయ్యే వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తున్నామని, గ్రామంలో అందరూ ఈ పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు చెబుతున్నారు. హెపటైటిస్-సీ వైరస్ వల్ల కలిగే లివర్ వ్యాధి అని వైద్యాధికారిణి లిఖిత అన్నారు. రక్తం ద్వారా వ్యాపించే ఈ వ్యాధి కాలేయ కేన్సర్‌కు దారితీస్తుందన్నారు. ఇంజెక్షన్లు, మాదకద్రవ్యాల వినియోగం, సురక్షితం కాని వైద్య పద్ధతులు, తిరునాళ్ళలో పచ్చబొట్లు వేయించుకోవడం, బహుళ భాగస్వాములతో లైంగిక సంపర్కం ఈ వ్యాధికి కొన్ని కారణాలుగా చెప్పారు. ఆలింగనం, ముద్దు, ఆహారం, నీరు ద్వారా ఈ వ్యాధి సోకదన్నారు. ఈ వ్యాధి సైలెంట్ కిల్లర్‌గా వ్యవహరిస్తుందన్నారు. ప్రస్తుతం ఈ వ్యాధిని పూర్తిగా నయం చేసేందుకు మందులున్నాయని వైద్యాధికారిణి తెలిపారు.

నేటి నుంచి గామన్ బ్రిడ్జిపై వార్షిక మరమ్మతులు

వారం రోజుల పాటు ఒక వైపే వాహన రాకపోకలు

కొవ్వూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు - రాజమహేంద్రవరం మధ్య గోదావరి నదిపై నిర్మించిన నాలుగులైన్ల గామన్ బ్రిడ్జిపై వారం రోజులపాటు వార్షిక మరమ్మతులు నిర్వహించనున్నట్టు టోల్‌ప్లాజా మేనేజర్ రాజీవ్ సింగ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వైపు వచ్చే దారిలో రెండు వైపులా వచ్చే వాహనాలను అనుమతిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ పనులు ఈ నెల 14 వరకు జరుగుతాయన్నారు. ఒకవేళ ఆ తేదీకి పూర్తికాని పక్షంలో మరి కొన్ని రోజులు మూసివేతను పొడిగిస్తామని, దీనికి వాహనదారులు సహకరించాలని కోరారు.

పోలీసుల అదుపులో అత్యాచార నిందితుడు

కరప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కూతురు వరసైన యువతిపై అత్యాచారం చేసి పరారైన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన మండాది అమ్మాజీ చనిపోయిన తన సోదరి కుమార్తెను చేర దీసి తన ఇంట్లో ఉంచుకుంది. వావివరసలు మరిచిన అమ్మాజీ భర్త శ్రీనివాసు ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆ యువతిని అత్యాచారం చేసి పరారైన విషయం తెలిసిందే. దీనిపై అత్యాచారం కేసు నమోదు చేసిన కరప పోలీసులు శనివారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మరోపక్క బాధితురాలికి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతుందని వారు చెప్పారు.

ఔషధాల చేప రూ.70వేలు

అంతర్వేది, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం మలినీ ఫిషింగ్ హార్బరులో మత్స్యకారుల వేటలో వలకు చిక్కిన కచిడీ చేప శనివారం వేలం పాట నిర్వహించారు. రూ.70వేలు ధర పలికిన ఈ కచిడీ ఆడ చేప కంటే మొగ చేప అయితే 3 రెట్లు ధర పలుకుతుందని కొనుగోలుదారులు అన్నారు. ఈ చేప పొట్ట భాగాన్ని ఔషధాలకు వినియోగిస్తారని తెలిపారు.



వేలం పాటలో ఉంచిన కచిడీ చేప

స్నేహితులతో కలిసి గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో స్నానానికి దిగిన యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో జరిగింది. పోలీసులు, రెవెన్యూ అధికారుల వివరాల ప్రకారం.. కొత్తపేట మార్కెట్ వీధికి చెందిన రొట్టా దుర్గాప్రసాద్(21) మరో నలుగురు స్నేహితులతో కలిసి కేదార్లంక ఇసుకర్యాంపు సమీపంలో గోదావరిలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసులు అధికారులు నదిలో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మిగిలిన నలుగురు బయటపడారు. కేదార్లంక ర్యాంపు వద్ద విచ్చలవిడిగా ఇసుక తవ్వేయడం వల్ల ఏర్పడ్డ గుంతల్లో దుర్గాప్రసాద్ గల్లంతై చనిపోయాడని ఆరోపిస్తూ కొత్తపేటకు చెందిన కుటుంబీకులు, బంధువులు మృతదేహం వద్ద ధర్నా నిర్వహించారు. న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. సంఘటనా స్థలాన్ని మండపేట సీఐ దొరరాజు, అంగర ఎస్ఐ రవికుమార్, గ్రామ వీఆర్వో వెంకటేశ్వరరావు పరిశీలించారు. ధర్నా చేస్తున్న బాధిత కుటుంబీకులు, బంధువులతో చర్చలు జరిపారు.



కేదార్లంకలో గోదావరి నుంచి దుర్గాప్రసాద్ మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న దృశ్యం

పింఛను సొమ్ములు దుర్వినియోగం


సొంతానికి వాడుకున్న పెనుమళ్ల వెల్ఫేర్ అసిస్టెంట్

పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంపీడీవో

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విషయం

కరప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం పెనుమళ్ల గ్రామంలో వెల్ఫేర్ అసిస్టెంట్ పింఛను సొమ్ములను దుర్వినియోగం చేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామంలోని లబ్ధిదారులకు పింఛను అందించడానికి వెల్ఫేర్ అసిస్టెంట్ ధనరాజు ఈ నెల 1వ తేదీన రూ.2.24లక్షల నగదు తీసుకున్నాడు. అయితే ఆ సొమ్ములను పింఛనుదారులకు పంపిణీ చేయకుండా సొంతానికి వాడుకున్నట్టు తెలిసింది. విషయం బయటకు పొక్కకుండా కొంతమంది స్థానిక నాయకులు ప్రయత్నించినా పింఛనుదారుల ఆందోళనతో కాజులూరు ఎంపీడీవో రాంబాబు గొల్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని పై స్థానిక సచివాలయ కార్యదర్శి జలాల్‌ను వివరణ కోరగా పింఛను సొమ్ము దుర్వినియోగం వాస్తవమేనన్నారు. అయితే ఈనెల 3వ తేదీ రాత్రి ఎస్ఐ సమక్షంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కొంత నగదును తిరిగి చెల్లించారని, వాటిని పింఛనుదారులకు పంపిణీచేయడం కూడా జరిగిందని వివరించారు. అందుబాటులో లేక పింఛన్లు తీసుకోని లబ్ధిదారుల సొమ్ము ఇంకా రూ.38వేలు వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద ఉందని, శనివారం సెలవు కావడంతో సోమవారం చెల్లించేలా అతడి వద్ద నుంచి రాతపూర్వక హామీ తీసుకున్నట్టు కార్యదర్శి పేర్కొన్నారు.

భార్య కాపురానికి రాకపోవడంతో భర్త అదృశ్యం



వీరాంజనేయులు

కిర్లంపూడి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై శనివారం కాకినాడ జిల్లా కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన ఓ.వీరాంజనేయులతో కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామానికి చెందిన కసిరెడ్డి శివరామకృష్ణ కుమార్తె గనిలక్ష్మితో వివాహమైంది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. గత కొంతకాలంగా వీరాంజనేయులు, భార్య గొడవలు పడుతున్నారు. ఈనెల 4వతేదీన వీరాంజనేయులు కిర్లంపూడిలోని అత్తగారింటికి వచ్చి భార్యను కాపురానికి రమ్మని అడగ్గా తాను రానని చెప్పడంతో గొడవ పెద్ద మనుషుల మధ్య పెట్టారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో వీరాంజనేయులు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అయితే వీరాంజనేయులు కాకినాడ రాకుండా కనపడకుండా పోయినట్టు అతడి తల్లి రాజేశ్వరి కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వీరాంజనేయులు ఆచూకీ తెలిసిన వారు జగ్గంపేట సీఐ 9440796529, 9440904834 నెంబర్లలో తెలియజేయాలని కోరారు.

పిడుగుపాటుకు గేదె మృతి



కోటనందూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గేదె మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా కోటనందూరు మండలం ఎల్‌డిపేట గ్రామంలో జరిగింది. శనివారం భారీ వర్షం కురిసి పిడుగుపడగా పొలంలో ఉన్న నెర్సిపూడి గంగరాజుకు చెందిన గేదె చనిపోయింది.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

జనసేన నేతలకు తప్పిన ప్రమాదం

శంఖవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తుని నుంచి చేబ్రోలు వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికుల వివరాల ప్రకారం.. తుని చెందిన జనసేన నేతలు చేబ్రోలులో ఎమ్మెల్సీ నాగబాబు పర్యటనకు హాజరయ్యేందుకు వెళ్తుండగా కత్తిపూడి శివార్లలో కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పొలాల్లోకి దూసుకెళ్లింది. ఎవరికీ గాయాలు కాలేదు. విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ),ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటుచేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గం ట వరకు నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మో హన్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడు దల చేశారు. ఈకార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.


జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొండబాబు, రాజశేఖర్


జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వీసీ ప్రసాద్, అధికారులు


పెనుగుదురులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూటమి నేతలు



పిఠాపురంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు నాగబాబు, హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వర్మ

జగ్జీవన్‌రామ్ చేసిన చట్టాలు నేటికీ నిలిచాయి

● ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ రాజశేఖర్ ● ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతి

కాకినాడసిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాబూజగ్జీవన్‌రామ్ చేసిన చట్టాలు నేటికీ స్థిరంగా నిలిచాయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పేర్కొన్నారు. మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీని వాసబాబా, రూరల్ నియోజకవర్గ ఎన్నికల కో ఆర్డినేటర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు సీకోటి అప్పలకొండ, పలివెల రవి అనంతకుమార్, బచ్చల కామేశ్వరరావు, బంగారు సత్యనారాయణ, బుంగా నాగరాజు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

● జేఎన్టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే: నిమ్న వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చేసినసేవలు చిరస్మరణీయమని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. వర్సిటీలోని వీసీ సమావేశపు హాల్లో జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని శనివారం ఎస్సీ, ఎస్టీ సెల్ లైజన్ అధికారి ఎం.కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించగా వీసీ ప్రసాద్, రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాద్, ఓఎస్డీ కోటేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొని బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ వీసీలు కేవీ ఎస్జీ మురళీకృష్ణ, పద్మరాజు, డైరెక్టర్లు డాక్టర్ ఎం.రమేష్, కృష్ణప్రసాద్, బాలాజీ, కృష్ణమోహన్, జోగారావు, రామకృష్ణ, రఘురాం పాల్గొన్నారు.

బడుగుల కోసం పాటుపడిన జగ్జీవన్‌రామ్

కాకినాడ సిటీ : బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పాటుపడిన గొప్ప సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్ అని కాకినాడ మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాస రావు, కాకినాడ జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మేకా లక్ష్మణమూర్తి పేర్కొన్నారు. శనివారం రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు స్థానిక క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుత్తుల రమణ, నాయకులు దుర్గాప్ర సాద్, రాముని నాయుడు, బొబ్బిలి గోవిందు, కామేష్, బడే కృష్ణ, రంగా, దొరబాబు, రావు, సతీష్ పాల్గొన్నారు.

●భారత ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్‌రామ్ 117వ జయంతి కార్యక్రమాన్ని శనివారం స్థానిక ముగ్గుపేట ఘాటీ సెంటర్ వద్ద ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన భద్రం మాస్టారు మాట్లాడుతూ ఏప్రిల్ 5న జగ్జీవన్‌రామ్, 11న మహాత్మా జ్యోతీరావ్ పూలే, 14న డాక్టర్ అంబేద్కర్ జన్మించారన్నారు.

కరప: మండలంలో శనివారం మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కరప ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీసత్తిబాబు, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఏవో బీఎల్ నరసింహంలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కరప, పెనుగుదురు, వలసపాకల, వేళంగి, నడకుదురు, జడ్.బావారం, గొడ్డటిపాలెం తదితర గ్రామాల్లో కూటమి నాయకులు, ఎస్సీ నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెనుగుదురులో వృద్ధులకు చీరలు పంపిణీచేశారు. జడ్.బావారంలో కేక్ కట్‌చేసి గ్రామస్తులకు పంచిపెట్టారు. ఆయా గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి చాట్ల ఇమ్మానుయేల్, కరప ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్, టీడీపీ, జనసేనపార్టీల మండల అధ్యక్షులు దేవు వెంకటేశ్వరరావు, బండారు మురళి, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగిరెడ్డి గంగాధర్, భోగిరెడ్డి కొండలరావు, తుమ్మలపల్లి మాచరరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: కాకినాడరూరల్ పండూరులో తాతపూడి దివాకర్, మోర్త అప్పారావుల ఆధ్వర్యంలో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో బీజేపీ, కూటమి నాయకులు పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఉపసర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి వెంకట శ్రీనివాస్, బీజేపీ కాకినాడ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు నందూరి సత్తిబాబు, లీలావతిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలు గ్రామాల్లో రాష్ట్ర శెట్టిబలజి కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావులు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జగ్జీవన్‌రామ్‌కు నాగబాబు నివాళి

పిఠాపురం: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు నివాళులర్పించారు. పిఠాపురం పట్టణంలోని జీవన్‌నగర్‌లో గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులు పూలమాలలు వేయగా, ఎమ్మెల్సీ నాగబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబులు ఉన్నారు.

● పట్టణంలో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు బీజేపీ, సీపీఎం నాయకులు పూలమాలలు వేపి నివాళులర్పించారు. చిత్రాడలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కొమ్మలను కట్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

భారీ వర్షానికి నేలకొరిగిన వృక్షాలు

కాకినాడ క్రైం ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ అకాల వర్షం కురవడంతో వేర్వేరు చోట్ల రెండు భారీ వృక్షాలు నేలకొరిగాయి. వృక్షాలు ప్రధాన రహదారుల్లో ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒక వృక్షం స్థానిక కచేరిపేటలోని సుందరయ్య భవన్ సమీపంలో పడిపోగా, మరో వృక్షం పాత ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారులో పడిపోవడంతో కాకినాడ నుంచి పిఠాపురం వెళ్ళే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సమాచారం అందుకున్న సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు తన సిబ్బందితో హుటాహుటిన చెట్లను తొలగించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

అలరించిన సంగీత కచేరి

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సంగీత సభాపతి కీర్తిశేషులు మునుగంటి శ్రీరామ్మూర్తి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు కార్యక్రమాన్ని కేవీఎస్ ఆంజనేయమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. సరస్వతి గానసభ అధ్యక్షుడు ఆంజనేయమూర్తి, విశాఖ మ్యూజిక్ అకాడమీ కార్యదర్శి శ్రీనివాస్, విశాఖ వారిచే జ్యోతి ప్రజ్వలన చేశారు. ద్విభాష్యం నగేష్‌బాబు సమర్పించిన మునుగంటి వారి గురించి తీసిన లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. అనేక మంది ప్రముఖులు వారు సంగీతానికి చేసిన సేవలు, గానకళ సంగీత పత్రికను నిర్వహించిన తీరు, సామాజిక దృక్పథంతో వారు అలంకరించిన పదవులు, తీసుకున్న బాధ్యతలు, చేసిన అనేక సేవలు చక్కగా వివరించారు. అనంతరం ప్రసన్న వెంకట్రామన్ చెన్నై వారి కచేరి జరిగింది. కళాకారులను మునుగంటి భాస్కర వెంకటరామకృష్ణ శాలువాలతో సత్కరించారు. వయోలిన్‌పై కొమండూరి వెంకట కృష్ణ, మృదంగంపై సద్గురుచరణ్ సహకారం అందించగా మునుగంటి వెంకట్రావు వందన సమర్పణ చేశారు.

ఫేక్ లేఖతో పార్టీని తప్పుదారి పట్టిస్తున్నారు

● వైసీపీ ఇన్‌చార్జి దొరబాబుపై చైర్‌పర్సన్ ఆగ్రహం

సామర్లకోట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):పెద్దాపురం నియోజకవర్గంలో వైసీపీ ఇంచార్జిగా వ్యవహరిస్తున్న దవులూరి దొరబాబు కబంధహస్తాల నుంచి కాపాడాలని సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణ పార్టీ నాయకులను కోరారు. వైసీపీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై చైర్‌పర్సన్ అరుణను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీకావడంపై శనివారం తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఒక ఫేక్ లేఖను ఇంచార్జి దొరబాబే సృష్టించారని ఆరోపించారు. తాను, తన భర్త వైసీపీ పార్టీకి చేసిన సేవలను గుర్తించే ఇంచార్జి దొరబాబు తల్లికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇవ్వకుండా పార్టీలో తన సేవలను గుర్తించే తనకు చైర్‌పర్సన్ పదవి ఇచ్చారన్నారు. తనను సస్పెండ్ చేశారనే లేఖ ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. జీ. కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఐ బ్యాంక్‌కు ఉపకరణాల అందజేత

కాకినాడ రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు బెంగుళూరుకు చెందిన మైక్రోటెక్ సంస్థ రూ.1,05,000 విలువైన ఉపకరణాలను విరాళంగా అందజేసినట్లు ఐ బ్యాంక్ కార్యదర్శి బాదం బాలకృష్ణ తెలిపారు. సంస్థ సీఈవో బచ్చు కమలబాబు చేతులమీదుగా అందజేయగా కార్యక్రమంలో ట్రస్టీలు రవికుమార్, నాని, వీరేంద్ర పాల్గొన్నారు.

ఆంజనేయరెడ్డికి ఉగాది నంది అవార్డు పురస్కారం


ఆంజనేయరెడ్డికి ఉగాది నంది పురస్కారాన్ని అందిస్తున్న మంత్రి దుర్గేష్

సర్పవరంజంక్షన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేట ఏపీఐఐసీకి చెందిన సామాజిక సేవా కార్యకర్త, చలివేంద్రం నిర్వాహకుడు అనపాల ఆంజనేయరెడ్డికి పాన్ ఇండియన్ సోషల్ కల్చరల్ అసోసియేషన్ ఉగాది నంది పురస్కారం అందించారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో పాన్ ఇండియన్ సోషల్ కల్చరల్ అసోసియేషన్ డాక్టర్ అద్దంకి రాజా ఆధ్వర్యంలో ఏటీఈ రోటరీ హాల్లో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో అనపాల ఆంజనేయరెడ్డి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు అనపాల ఆంజనేయరెడ్డికి ఉగాది నంది-2025 పురస్కారాన్ని రాష్ట్ర పర్యాటక, సాం స్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అందించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ గత ఇరవై ఐదేళ్లుగా నిరంతరం చలివేంద్రం నిర్వహిస్తూ ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్న ఆంజనేయరెడ్డి సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గజల్ శ్రీనివాస్, హారిక నర్సిపల్లి, పిఠాపురం రాజాబహదూర్, రంగ సాయి తదితరులు పాలొన్నారు.

13న కేంద్ర ఆర్థికమంత్రిని కలుస్తాం


కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబును సత్కరిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదించిన బిల్లు పింఛన్‌దారులకు గొడ్డలి పెట్టువంటిదని ఏపీఎస్‌జీఆర్ఈ అసోసియేషన్ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు శాస్త్రి అన్నారు. శనివారం కాకినాడలో ఏపీఎస్‌జీఆర్ఈ అసోసియేషన్ కాకినాడ బ్రాంచ్ నెలవారీ సమావేశం సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లువల్ల భవిష్యత్‌లో ఆమోదించబోయే పే రివిజన్ స్కేళ్లకు అర్హత కోల్పోతారన్నారు. పాత మూలవేతనం మాత్రమే పొందుతారని దీనిపై అందరూ కలిసికట్టుగా ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ఈనెల 13న సంఘ నాయకులతోకలిసి డిల్లీ వెళ్లి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌ను కలిసి మెమోరాండం అందజేస్తామన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ ఈ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. అనంతరం వారిని సత్కరించారు.

వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెతున్న ప్రభుత్వం

● సీపీఐ పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్, రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే విధానంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కొనసాగుతుందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యుడు వి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు విమర్శించారు. స్థానిక గాంధీ భవన్‌లో శనివారం అఖిలభారత వ్యవసాయ-గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు తామాడ సన్యాసిరావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్, రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు, అయ్యార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక మూడు నల్ల వ్యవసాయ చట్టాలను, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని మండిపడ్డారు. బీజేపీ-మోదీ విధానాలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తూచా తప్పక పాటిస్తోందని, ఈ విధానాలపై క్షేత్రస్థాయిలో కార్మికులు రైతులు, కౌలు రైతులు ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలని పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు సత్యనారాయణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు

వాకాడ మహిళకు బంగారు పతకం


గంగాభవానికి బంగారు పతకం అందిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

కరప, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీమద్భగవద్గీత పారాయణంలో కరప మండలం వాకాడ గ్రామానికి చెందిన దూడల గంగాభవాని బంగారు పతకం సాధించారు. శ్రీ అవధూత దత్తపీఠం శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమం మైసూర్ వారిచే ఈనెల 2వ తేదీన నిర్వహించిన ఈ మద్భగవద్గీత పారాయణంలో ఆమె పాల్గొని ఉత్తమ శ్రేణి బంగారు పతకం సాధించినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. భాగ్యనగరం ఎస్‌జీఎస్ ఆశ్రమంలో సద్గురు గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా ఆమె బంగారు పతకాన్ని, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. మంచి ప్రతిభతో గోల్డ్ మెడల్ సాధించిన గంగాభవానిని డాక్టర్ బొండా సూర్యారావు, మాజీ ఉపసర్పంచ్ దూడల నారాయుడు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, రామలింగేశ్వర రైస్‌మిల్ మేనేజింగ్ పార్టనర్ తమలంపూడి వీరరాఘవరెడ్డి, గరగ జెమ్మీ, శాకా శ్రీనివాస్, వాకాడ గ్రామస్తులు అభినందించారు.

సంక్షేమ వసతి గృహాల్లో మరిన్ని వస్తువులు

● కలెక్టర్ షాన్‌మోహన్


విద్యార్థులకు కేక్ పంచుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మరిన్ని సౌకర్యవంతమైన వస్తువులను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. స్థానిక వరాహాలయ్యపేటలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల ఆనంద నిలయాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)తో కలిసి శనివారం సందర్శించారు. ముందుగా డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వసతిగృహంలో అందుతున్న సౌకర్యాలు, భోజనం మెనూ వివరాలు, భోజనం నాణ్యతలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహం విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన ఇన్వెర్టర్, ఆర్వో ప్లాంట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. అనంతరం జిల్లాకలెక్టర్ వసతిగృహం ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆర్డీవో కె.శ్రీరమణి, సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి ఎస్.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

పిఠాపురంలో రెల్లి సంఘాల మహా పాదయాత్ర

● ఎస్సీ వర్గీకరణలో 3శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్


పిఠాపురంలో మహాపాదయాత్ర నిర్వహిస్తున్న రెల్లిసంఘాల నాయకులు

పిఠాపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల విషయంలో రెల్లి అనుబంధ కులాలుకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ రెల్లి కుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలో శనివారం మహాపాదయాత్ర నిర్వహించారు. పశువులసంత నుంచి ప్రధాన రహదారుల మీదుగా తహసీల్దారు కార్యాలయం వరకూ పాదయాత్ర సాగింది. తహసీల్దారు కార్యాలయంతో పాటు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులకు వినతిపత్రాలు అందజేశారు. అధికసంఖ్యలో ఉన్న రెల్లి అనుబంధ కులాలుకు కేవలం ఒకశాతం రిజర్వేషన్ ప్రకటించడం సరికాదని నాయకులు అన్నారు. కనీసం మూడు శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాజా జనాబాను ప్రాతిపదికగా తీసుకోవాలన్నారు. బేడబుడ్గ జంగాలను వేరే గ్రూపులో చేర్చాలని సూచించారు. పాదయాత్రలో న్యాయవాది బంగారు రామకృష్ణ, ఆకుల సూరిబాబు, అల్లం కిషోర్, ఎర్రంశెట్టి శ్రీనివాస్, ఇంటి రాంబాబు, దడాల నాని, అల్లం పాపారావు, రెల్లి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరరావు, నిమ్మకాయల రమణమూర్తి, మీసాల ఏడుకొండలు, కోనా నారాయణరావు, బంగారు ద్వారక, నాగమణి, దుర్గాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం

● ఎమ్మెల్సీ నాగబాబు


సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎల్లప్పుడు అండగా ఉంటారని ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్ నివాసంలో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 45మందికి మంజూరైన రూ.40లక్షలను ఆయా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కౌడా చైర్మన్ తుమ్మల బాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో కూటమి ప్రభుత్వం నేతృత్వంలో చేపట్టిన పలు అభివృద్ధిపనులను ఎమ్మెల్సీ కె.నాగేంద్రబాబు శనివారం ప్రారంభించారు. మండల కేంద్రమైన కొత్తపల్లి, ఉప్పాడ శివారు కొత్త మాయాట్నం, అమరవల్లి గ్రామాల్లో ఉపాధి నిధులతో నిర్మించిన సిమ్మెంటురోడ్లను ఎమ్మెల్సీ ప్రారంభించారు. ప్రారంభోత్సవాలు చేసిన గ్రామాల్లో ఎక్కడా ఎమ్మెల్సీ నాగేంద్రబాబు మాట్లాడకపోవడంతో అతని రాకకోసం గం టల తరబడి వేచి చూసిన ప్రజలు అసంతృప్తికి లోనయ్యారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జనసైనికులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, కొత్తపల్లి సర్పంచ్ గవర భావానీ నాగేశ్వరరావు, పీబీసీ డీసీ-1 చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, కొణమర్తి రాంబాబు, మత్సా అప్పాజీ, పిల్లా శివశంకర్, చింతలపూడి వెంకటరమణ తదితర జనసైనికులు, ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్డీ సత్యారెడ్డి, కార్యదర్శి సత్యనారాయణమూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాములోరి కల్యాణం చూతము రారండి

● ముస్తాబైన రామాలయాలు

● నేడు ఊరువాడ అంతా సందడే



పిఠాపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాములోరి కల్యాణానికి పట్టణాలు, గ్రామాలు సిద్ధమవుతున్నాయి. సీతారాముల ఉత్సవమూర్తుల గ్రామోత్సవాలు, ఆపై కల్యాణం, అన్నదానం ఇలా రోజంతా మన ఇంట్లోనే పెళ్లి జరిగినంత హడావుడి..ఊరూ వాడా సీతారాముల కల్యాణాన్ని వైభవంజరిపేందుకు సన్నద్ధమవుతున్నారు.

పిఠాపురం నియోజకవర్గంలోని సీతారామస్వామి ఆలమాలు, రామాలయాలు, రామకోవెలలు, విష్ణాలయాలు శ్రీరామనవమి వేడుకలకు సిద్ధమయ్యాయి. ఆలయాలకు రంగులు వేసి మామిడితోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం కల్యాణం నిర్వహించేందుకు వీలుగా వేదికలు, వచ్చిన ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకుగానూ పందిర్లు, టెంట్లు వేస్తున్నారు. పలు ఆలయాల వద్ద అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం, తహసీల్దారు కార్యాలయం సమీపంలో వేంచేసి ఉన్న పురాతనమయిన సీతారామాంజనేయస్వామి ఆలయంతో పాటు చిట్టోడితోట, అగ్రహారం, బొజ్జావారి తోట, రజకపేట, పల్లపువీధి, వెలంపేట, పుల్లయ్యకాలువ వీధి తదితర ప్రాంతాల్లోని రామాలయాల్లో, కూరగాయల మార్కెట్, మంగాయమ్మరావుపేట పెదరామాలయం తదితర ప్రాంతాల్లో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.

చేబ్రోలు రాములోరి కల్యాణానికి ప్రత్యేకత

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు సీతారామస్వామి ఆలయంలో జరిగే కల్యాణానికి మాత్ర ం ప్రత్యేకత ఉంది. అన్నిప్రాంతాల్లోని ఆల యాల్లో శ్రీరామనవమి రోజున పగటిపూట కల్యా ణాలు జరుగుతాయి. ఇక్క డ మాత్రం అందుకు భిన్నంగా రాత్రిపూట కల్యాణం నిర్వహిస్తారు. పిఠాపురం మహారాజా కాలం నాటి నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. మహారాజా ఇక్కడ జరిగే కల్యాణానికి హాజరయ్యేవారు. మహారాజా తన సామ్రాజ్యంలోని అన్ని ప్రాంతాల్లో జరిగిన కల్యాణాలకు హాజరవుతూ రాత్రి సమయానికి ఇక్కడకు చేరుకునేవారని, ఆయన ప్రత్యక్షంగా ఇక్కడ పాల్గొనేందుకు వీలుగా ఈ ఏర్పాటు చేశారని చెబుతున్నారు. ఇంకో వాదన ఉంది. అన్ని ప్రాంతాలు నుంచి ప్రజలు వచ్చి కల్యాణాన్ని తిలకించేందుకు వీలుగా ఈ ఏర్పాటు చేసినట్లు చెబుతారు. ఆదివారం అర్ధరాత్రి ప్రారంభమయ్యే కల్యాణ వేడుక తెల్లవారుజాము వరకూ కొనసాగుతుంది. ఇందుకు సంబంధించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పశువుల నీటి తొట్టె నిర్మాణాలకు శంకుస్థాపన

కిర్లంపూడి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువులకు నీటి కోసం నీటితొట్టెలు నిర్మిస్తున్నట్టు సర్పంచ్ మందేటి వీరలక్ష్మి పెద్దిరాజు తెలిపారు. ఎస్.తిమ్మాపురం గ్రామ శివారున శనివారం పశువుల నీటితొట్టె నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.33వేలతో నిర్మాణం జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు నామసాని తాసు, కానూరి కాసులు, సోము నారాయణరావు, మందేటి ముంగరలయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



మోతుగూడెంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

బాబూజీకి ఘన నివాళి

- పలుచోట్ల మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి
- నివాళులర్పించిన పలువురు నాయకులు, అధికారులు



ఇందుకూరుపేటలో జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం



వై.రామవరంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం ఏపీఎస్ ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు విచ్చేసి చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఏపీ జెన్‌కో లోయర్ సీలేరు సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, లోయర్ సీలేరు జెన్‌కో ఉద్యోగస్తులు, వేమగిరి కిరణ్, పీటీ రామారావుతో పాటు ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

వై.రామవరం: మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. మండల పరిషత్ పరిపాలనా అధికారి బాపన్నదొర ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేట ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పల్లపాటి నాగేశ్వరరావు, గోళ్ల చంటిబాబులతో పాటు పలువురు యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామికి పట్టువస్త్రాల అందజేత



పట్టు వస్త్రాలు అందజేస్తున్న దృశ్యం

వీఆర్‌పురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ మాజీ సభ్యుడు, రేఖపల్లి ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు శ్రీరామగిరి గ్రామంలోని రామాలయంలో సీతారామచంద్రస్వామికి పట్టువస్త్రాలు, తలంబ్రాల బియ్యం శనివారం ఆలయ అర్చకుడు పురుషోత్తమాచార్యులకు అందించారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెందుర్తి సుదర్శన్, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, అంజి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధికారి బాపన్నదొర

వై.రామవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలో వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగు నీటి ఎద్దడిని నివారణకు చర్యలు చేపట్టాలని మండల పరిషత్ పరిపాలనాధికారి బాపన్నదొర ఆదేశించారు. ఆయన వారికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి పంచాయతీ పరిధిలో తాగు నీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటి సమస్య ఎదురైతే 9440588637లో తెలియజేయాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు అన్ని రకాల సర్వేలను వేగవంతం చేయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

మాజీ మంత్రి యనమలను కలిసిన చైర్మన్లు



తేటగుంటలో యనమలను కలిసిన నేతలు

తుని రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తాజాగా ఐఎంసీ చైర్మన్‌గా ప్రకటించిన కోటనందూరు మండలం పీఈ చిన్నయ్యపాలెంకి చెందిన అంకం రెడ్డి రమేష్, కోటనందూరు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎంపికైన వెంకట కృష్ణారావు స్థానిక టీడీపీ నేతలతో కలిసి తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని యనమల అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, చింతమనేడి నాగ సోమరాజు(అబ్బాయి), గాడి రాజబాబు, చిరంజీవి రాజు, ఆవుగడ్డి వెంకటరమణ ఉన్నారు.

భారీ వర్షం



ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు/తుని రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడుతోపాటు తుని పట్టణం, మండల ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురుగాలులతో గంటన్నర పాటు కుండపోత వర్షం కురిసింది. గడిచిన పదిరోజులుగా ఎండలకు అల్లాడిపోతున్న మండల ప్రజానీకానికి ఈ వర్షం ఎంతో ఉపశమనం ఇచ్చింది. ఈ సందర్భంగా గాలివాన, ఈదురుగాలులకు పలుచోట్ల మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. జీడిమామిడి తోటల్లోని పూతతోపాటు పిందెలు రాలిపోయాయి. అపరాల పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ఈ వర్షం ప్రభావం మామిడి, జీడిమామిడి కాయల దిగుబడిపై పడుతుందని రాబడిలో నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తుని రూరల్‌లో..

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

చిరస్మరణీయుడు బాబూజగ్జీవన్‌రామ్: యనమల

జగ్జీవన్‌రామ్‌కు పలువురు నివాళి

తుని రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చిరస్మరణీయుడు మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ అని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు తేటగుంట క్యాంప్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన యనమల జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ చేసిన కృషి జాతి మరువలేమన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు యనమల రాజేష్, చింతమనేడి అబ్బాయి, సుర్ల లోవరాజు, యనమల లక్ష్మణరావు, దూలం మురళి, అన్వేష్, అడిగేల నరసింహమూర్తి, బోనం చినబాబు, నాగు, పలివెల లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): పెద్దిపాలెంలో నూతనంగా నిర్మించిన బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని బీజేపీ జిల్లా నాయకుడు చిలుకూరి రామ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విగ్రహ దాత చింతాకుల భాస్కరరావు, నిర్వాహకులు కొప్పిశెట్టి సుధీర్, చింతాకుల రవిప్రసాద్, ఉండ్రాజు అరుణ్‌కుమార్, బీజేపీ మండలాధ్యక్షుడు ఊటా వీరబాబు పాల్గొన్నారు. ప్రత్తిపాడు కోర్టు వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి జడ్జి కాటం భాను పూలమాలవేసి నివాళులర్పించగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజాల చిట్టిబాబు, పి.మధుబాబు, సీనియర్ న్యాయవాదులు బుగతా శివ పాల్గొన్నారు. గజ్జనపూడిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మాజీ సర్పంచ్ కాపారపు రాంబాబు నివాళులర్పించారు. ప్రత్తిపాడు కాంగ్రెస్ కార్యాలయం వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పీసీసీ సభ్యుడు ధర్నాలకోట శ్రీను నివాళులర్పించారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉపప్రధానమంత్రి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. శనివారం పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జె.అన్నవరంలో అరుంధతీ మాదిగ యువజన సంఘం నేతృత్వంలో జగ్జీవన్‌రామ్ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఏలేశ్వరంలో పాత బస్‌స్టాండ్ వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణ స్వామి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, యండగుండి నాగబాబు, అలమండ వీర్రాఘవస్వామి, సుంకర సత్యనారాయణ, కాకాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



తునిరూరల్: బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యనమల



కిర్లంపూడి: శృంగరాయునిపాలెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న తుమ్మలపల్లి రమేష్

కిర్లంపూడి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని శృంగరాయునిపాలెం దళితపేటలో శనివారం బాబుజగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవన అరుంధతి సంక్షేమ సేవా సంఘం యువ నాయకుడు గండేటి డేవిడ్‌రాజు, తలుపులయ్య, ఆనందరావు, వీరబాబు, డేవిడ్‌రాజు యూత్‌సభ్యుల ఆధ్వర్య లో పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎస్.తిమ్మాపురంలో సర్పంచ్, దళిత నాయకులు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.



ఏలేశ్వరం: పెద్దనాపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

శంఖవరం, (ఆంధ్రజ్యోతి): బాబుజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో ఆయన విగ్రహాలకు నివాళులర్పించారు. కొత్తపల్లిలో విగ్రహం షెడ్డు నిర్మాణం కోసం విరాళం అందించిన కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయ దుర్గను దండోరా సభ్యులు అభినందించారు. ఈగల అప్పారావు, ఈగల దేవుళ్ళు, మటం సత్యనారాయణ పాల్గొన్నారు.

గండేపల్లి, (ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి సేవలు మరువలేనివని టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని గండేపల్లిలో శనివారం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.మురారిలో జగ్జీవన్‌రామ్‌కు ఉపసర్పంచ్ జాస్తి వసంత్ నివాళులర్పించారు.

జగ్గంపేట: గుర్రంపాలెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ పూలమాల వేశారు. కార్యక్రమంలో గుర్రంపాలెం యూత్, మండలాధ్యక్షుడు పల్లా రాము, సుబ్రహ్మణ్య రాజు, బీజేపీబూత్ కమిటీ మెంబర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి, (ఆంధ్రజ్యోతి): జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఏవీనగరంలో టీడీపీ సీనియర్ నేత యనమల నాగేశ్వరరావు జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బెండపూడిలో జగ్జీవన్‌రామ్‌కు గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సాధనాల నూకరాజు నివాళులర్పించారు. కొమ్మనాపల్లిలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

శ్రీరామనవమికి సర్వం సిద్ధం



రాజుపాలెంలో రామాలయం వద్ద చలువ పందిరి వేసిన దృశ్యం

కిర్లంపూడి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాలకు మండలంలోని రామాలయాన్నీ చలువపందిళ్లు, మామిడి తోరణాలు, విద్యుద్దీపాలంకరణలతో ఎంతో శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు.

రామాలయాలు సిద్ధం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆదివారం శ్రీరామనవమి వేడుకలకు మండలంలోని రామాలయాలు సిద్ధమయ్యాయి. ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, ఉత్తరకంచి, ఏలూరు గ్రామాల్లో రాములోరి కల్యాణం నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టారు. ధర్మవరంలో వీధికో రామాలయం వంతున 15 రామాలయాల వద్ద శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు చలువపందిళ్ళు, మామిడి తోరణాలు, పూల అలంకరణలు చేశారు.

సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ధర్మవరంలో తడి,పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాథ్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నూతనంగా ఏర్పాటుచేసిన సంపద తయారీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాథ్ కోరారు. చింతలూరు, ఉత్తరకంచి, ధర్మవరం గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో సంపద తయారీ కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. గ్రామంలో డోర్ టు డోర్ చెత్త సేకరణ, సంపద కేంద్రాల వద్ద నిర్వహించే పనులపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సర్పంచ్‌లు మంతెన వెంకటరమణ, బెంతుకుర్తి సుశీల అబ్బాయి, కార్యదర్శి వి.కామరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి ఇన్వర్టర్ బహూకరణ



గండేపల్లి, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు జియ్యన్న మఠంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామ టీడీపీ నాయకుడు, పంచాయతీ వార్డు మెంబర్ ఇంజరపు దుర్గమేరి దంపతులు శనివారం ఇన్వర్టర్‌ను బహూకరించారు. వారికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్ భాస్కరాచార్యులు, ఎం.రమేషాచార్యులు, కె.రామకృష్ణాచార్యులు, కె.వెంకటేశ్వరాచార్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు



ఏలేశ్వరంలో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ఏలేశ్వరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్ ఎస్వీ రమణను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ 43వ రోజు యూనియన్ సభ్యులు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. శనివారం ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ యూనియన్ సభ్యులు సంయుక్తంగా డిపో ప్రాంగణంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. స్థానిక డిపోకు చెందిన డ్రైవర్ రమణను 1/2019 సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేశారని, అతడిని విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. యూనియన్ డిపో కార్యదర్శ యాబి ఎం.కుమార్, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎన్‌పి రావు, త్రిమూర్తులు, జేఏసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సుబ్బారెడ్డి సాగర్ కాలువ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ ఇళ్ళ అప్పారావు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గోకవరం గ్రామం వద్ద మిడియం ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రధాన కాలువలకు రూ.7.8లక్షలతో నిర్మించే అభివృద్ధి పనులకు శనివారం సాగర్ చైర్మన్ ఇళ్ళ అప్పారావు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కృషితె సుబ్బారెడ్డి సాగర్ ప్రధాన కాలువ వద్ద నుంచి పొదురుపాక కాలువ వరకు 3.5కిలోమీటర్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు దిడ్డి సుబ్బారావు, దేవ రాజబాబు, ఇరిగేషన్ ఏఈ ఇబ్రహం, రీసు సత్తిబాబు, కోరుకొండ శ్రీను, నాగులాపల్లి నానాజీ, లొండా వెంకటేష్, దేవర కృష్ణార్జున, మంతెన శ్రీను, జువ్వెన తిరుపతిరావు, లొండా లోవరాజు, అన్నిక అప్పారావు పాల్గొన్నారు.

క్రైస్తవులకు రక్షణ కల్పించండి



కత్తిపూడిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

శంఖవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రైస్తవులు, చర్చిలకు రక్షణ కల్పించాలని పాస్టర్ల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా కత్తిపూడిలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని, క్రైస్తవ మందిరాలకు, పాస్టర్లకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎం.మోహన్, ఎం.భాస్కరారావు, ఏలీషా, డి.యాకోబు, పి.టిపాల్, గునపర్తి అపురూప్ పాల్గొన్నారు.

ఆక్రమణదారులను గుర్తించే సర్వేను వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ మురార్జీ

తొండంగి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు గుర్తించడానికి సర్వేను వేగవంతం చేయాలని తహశీల్దార్ మురార్జీ గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లకు సూచించారు. శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి జీవో నెంబరు 30 ప్రకారం అర్హత కలిగిన వారిని గుర్తించేందుకు గ్రామాల్లో జరుగుతున్న సర్వేను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నూరుశాతం కచ్చితత్వంతో సర్వే జరగాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఆర్ఐ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకార సేవ



అన్నవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ప్రాకారసేవ శనివారం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి పండితుల ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముమ్మారు తూర్పు రాజగోపురం చుట్టూ ప్రదక్షణ గావించారు.

పిఠాపురం వెళ్లిన తుమ్మలపల్లి

జగ్గంపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు పిఠాపురం నియోజకవర్గంలో పలుఅభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. నాగబాబుతో పాటు జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో భారీ వర్షం

జలమయమైన రోడ్లు

ఏలేశ్వరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం కురిసిన వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. గత ప్రభుత్వం ఏఒక్క రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పెద్ద పెద్ద గుంతలతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో వర్షం నీరు పోయే మార్గం లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే రహదారులపై గుంతల్లో నిలిచిపోతుంది. నగర పంచాయతీ పరిధిలో షిర్డీనగర్, చైతన్య నగర్, లక్ష్మవరంకాలనీల్లో సీసీ రోడ్లు అభివృద్ధి చేయాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో చినుకుపడితే బురద నీరు చేరడంతో బాటసారులు, స్థానికులకు అవస్థలు తప్పడంలేదు.

గృహాల్లోకి వర్షం నీరు

రౌతులపూడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మండలంలో భారీ వర్షం కురిసింది. రౌతులపూడి బీసీ కాలనీలో మురుగు కాలువ సక్రమంగా లేకపోవడంతో వర్షం నీరు ఎక్కడికక్కడే ఉండిపోతుంది. దీంతో గృహాల్లోకి నీరు చేరుతోంది. ఇందుకు నిదర్శనం శనివారం కురిసిన వర్షానికి బంగారు నూకాలమ్మకు చెందిన తాటాకిల్లు నీట మునిగింది.

నిలిచిన విద్యుత్ సరఫరా

కిర్లంపూడి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లు, డ్రైనేజీలు జలమయమయ్యాయి. ఉదయం ఎండకాయడంతో ఉక్కపోతకుగురైన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు.

ఊరటనిచ్చిన వర్షం

కోటనందూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా ఎండ వేడిమికి అల్లాడుతున్న మండల ప్రజలు శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో సేద తీరారు. పశువులకు కొంత మేర ఇబ్బందులు తొలిగాయి. కోటనందూరు, కాకరాపల్లి, జగన్నాధపురం కెఎమల్లవరం అల్లిపూడి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

జగ్గంపేటలో భారీ వర్షం

జగ్గంపేట , ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో శనివారం సాయంత్రం నాలుగున్నర ప్రాంతంలో వాతావరణంలో మార్పులతో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి ఎండ వేడిమితో ఇబ్బంది పడ్డ ప్రజలు వర్షంతో కొంత ఉపశమనం పొందారు.

చిరు జల్లులతో ఊరట

తొండంగి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఏర్పడింది. పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు వర్షంతో వాతావరణం చల్లబడటంతో ఆహ్లాదంతో పాటు ఆనందాన్ని ఇచ్చింది.

తహశీల్దార్ పర్యటన

కోటనందూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జీవో 30 ప్రకారం అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో ఇప్పటికే ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నవారి ఇళ్ల స్థలాలు రెగ్యులరైజ్ చేసుకోవడానికి అవకాశం కల్పించామని తహశీల్దార్ సుభాష్ అన్నారు. మండలంలోని కొత్తకొట్టాం, భీమవపరుకోట తదితర గ్రామాల్లో పర్యటించి వీఆర్వోలకు సూచనలిచ్చారు. మండలంలో 17పంచాయతీల్లో అర్హులైన లబ్ధిదారులందరూ ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. డీటీ పీవీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ చిటికెల సత్యనారాయణ పాల్గొన్నారు.